

# 'ఇదీ ప్రేమ కథే'

చాగంటి శరత్ బాబు

**"నా పేరు సుల్తానా!" గుసగుసలాడినా అతనికామాట స్పష్టంగానే వినపడింది.**

"రాము" అన్నాడతను. ఇద్దరి ముఖాల్లోనూ చిరునవ్వు తొంగి చూసింది. అంతకుమించిన మాటలేవో ఇద్దరికీ లోపల వినపడ్డాయి. ఆమె కళ్లు బరువెక్కి వాలిపోవటాన్ని అతను గమనించగలిగాడు. అతని చేతుల్లో కొద్దిగా వణుకు పుట్టడం ఆమెకీ తెలిసింది. ముసిముసిగా నవ్వుకుంది.

* * *

"ఈ రోజు బాక్స్ తెచ్చుకోలేదా?"

"ఒంటరిగాణ్ని. నేనుకాక ...?"

"నా బాక్స్‌లోంచి కొద్దిగా ..."

"అబ్బే, ఎందుకండీ? కాంటీన్‌కి వెళ్లి ..."

"ఫర్వాలేదు, కొద్దిగా ..."

"ఒద్దండీ! అలా కాంటీన్ ..."

"అంతేనా?" అదోలా చూసింది.

అతనికి మాట తోచలేదు.

"ఏం, కాస్త తింటే మీరేమైనా..." ఆ తర్వాతేం మాట్లాడాలో ఆమెకీ తోచలేదు. మరి కాసేపటికి గొంతు అతికష్టంమీద పెగుల్చుకుని, "ప్లీజ్! నా కోసం .." అంది.

ఆ మాట అన్నాక తలెత్తి అతనివైపు చూడటం సాధ్యపడలేదామెకి.

అతను ఏదో చెప్పాలని మాటల కోసం వెతుక్కుంటూనే ఉండిపోయాడు.

చేతులు కడుక్కుని వచ్చాక అడిగింది.

"మా వంటలు మీకు నచ్చవేమో!"

"చాలా రుచిగా ఉంది. పైగా మీరు పెడితే ఏదైనా రుచిగానే ఉంటుంది."

"ఊరికే అంటున్నారు కదూ?"

"కాదు, మనసు లోతుల్లోంచి ..."

పుస్తకాల్లో మాత్రమే రాయదగ్గ మాటలు తను ఎలా ఉపయోగించ గలిగాడా అని అతనికి తర్వాతెప్పుడో అనిపించింది.

ఆమె మాత్రం ఎర్రబడిన ముఖంతో నేల చూపులు చూస్తూ ఉండి పోయింది. అప్పుడే ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసుకోవాలన్న ప్రయత్నంలో ఇద్దరూ విఫలమయ్యారు.

* * *

## గాడిద జీవితం

**గా**డిదకు ముఖ్యాహారం నీరనే చెప్పుకోవాలి. మూడు లీటర్ల నీళ్లని ఒక్క గుక్కలో లాగించేస్తుందది. ఇది అన్ని కాగితాలనూ తినదు. పలుచని కాగితాన్ని మాత్రం ఎంచక్కా తినేస్తుంది. అసలు ఎటువంటి ఆహారం లేకపోయినా ఇది వారం రోజులు తట్టుకోగలదు. ఇది సామాన్యంగా 45 కిలోల వరకు బరువు మోయగలదు.

శ్రీకొండ (ఎర్రబోడు)

"అనాథనే. నాకు ఎవరూ లేరు."

"అలాగా!"

"అవును, మా అమ్మ సంవత్సరం క్రితమే పోయింది. అప్పటి నుంచీ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంటున్నాను."

"అక్కడెందుకు? ఎక్కడైనా ఓ మంచి రూమ్ తీసుకుని ..."

"ఒక్కదాన్నినా ...?"

"ఇన్నాళ్లూ అంటే వేరు. ఇప్పుడింకా ఒక్కదాన్నీ ఏమిటి?" చిలిపిగా చూశాడు.

"ఇప్పుడు రూము కాదు, పోర్షనే కావాలి కదా!' ' అంది తనూ తక్కువ తినలేదన్నట్లు.

"ఎందుకో?"

"ఏమో బాబూ, మీరే చెప్పండి!"

"నే నెలా చెప్తాను, నీ మనసులో ఏం ఉందో ...?"

"నా ... ఏముందీ? ... మీరే ఉన్నారు!"

"నిజంగా?"

"మీ తోడు!"

* * *

"అదీ సంగతి. ఎంతైనా పెళ్లి అన్నాక కాస్త హడావుడి తప్పదు కదా! కాబట్టి నువ్వు ..."

"ఇహ నాకొదిలెయ్ గురూ! సుల్తానా, నువ్వు పెళ్లి చేసుకోవటం మన ఆఫీసుకే ఓ కళ. రేపే ముహూర్తం పెట్టిద్దాం!"

"అయితే, మా ఇద్దరి సంగతీ నీకు తెలుసుగా. అంతా కలిపి రెండు వేలున్నాయి. దాంట్లోనే ..."

"డబ్బు సంగతి పక్కన పెట్టు. నువ్వు దర్జాగా ఇంటికి పోయి కొత్త కాపరం గురించి కలలు కనేయ్! వాటిని నిజం చేసే ప్రోగ్రాము నేను చూస్తాను. గుడ్ లక్!"

రాము ఆనందంగా వెళ్లిపోయాడు.,

"విశ్వనాథానికి చెప్పాను" అన్నాడు ఆ సాయంత్రం.

సుల్తానా 'అమ్మయ్య' అనుకుంది. "హడావుడి మనిషి. మంచివాడే. ఎప్పుడు?"

"రేపే ముహూర్తం పెట్టిస్తాడట."

"మరి డబ్బు ...?"

"అదీ చెప్పాను. పర్వాలేదన్నాడు."

"పెళ్లయ్యాక అందరికీ పార్టీ ఇద్దాం!"

"అందరి పార్టీ సంగతి నాకెందుకు? నాకేం పార్టీ ఇస్తావు?'

"ఛీ! పో, బాబూ! అలా మాట్లాడితే ..."

"ఇంకెక్కడికి పోతాను, కట్టేశా వుగా!"

"వ్వే...వ్వే... వ్వే...!" అంటూ వెక్కిరించింది సుల్తానా.

* * *

"అంచేత మై డియర్ ఫ్రెండ్స్! ఇప్పుడు మనం అందరం కలిసి ఈ పెళ్లి జరిపించాలి. మరోసంగతి - రాము హిందువు, సుల్తానా ముస్లిం. వాళ్ల వివాహం గొప్ప ఆదర్శవివాహం అవుతుంది. హేతువాదులు, న్యూస్‌పేపర్లు మనని ఎంతైనా ప్రశంసిస్తాయి" అన్నాడు విశ్వనాథం.

అందరూ గ్లాసులు బల్లమీద పెట్టి "హియర్! హియర్!" అంటూ చప్పట్లు కొట్టారు.

విశ్వనాథం విస్కీని మరోసారి సిప్ చేసి, "మంగళసూత్రాల ఖర్చు కనీసం మూడు వేలు. మనం అందరం తలో వెయ్యి, పోనీ ... అయిదు వందలు ..."

"అక్కర్లేదు. నాకు తెల్సిన వాళ్లున్నారు. చందాలు దండేద్దాం, కళ్యాణమండపం ఫ్రీగా ఇప్పిస్తారు కూడా! ఎం.ఎల్.ఏని కూడా పిలిస్తే అదిరిందన్నమాటే!"

"వస్తాడంటావా?" అన్నాడు విశ్వనాథం అనుమానంగా.

ఆ మర్నాడే ఆ ప్రశ్నకి ఎం.ఎల్.ఏ.గారు జవాబు చెప్పేశాడు. "ఇలాంటి అభ్యుదయ మేరేజీలు సెయ్యాల! పురోహితుడ్ని గట్రా నేనే పురమాయిప్పిత్తాను! లెవెల్లో సేద్దారి. అదిరిపోవాల!"

చందాలు పోగుపడ్డాయి.

"ఇంకో వారం రోజుల్లో పెళ్లి. ఈ పెళ్లి గొప్ప పెళ్లి. మతాంతర వివాహం. మతోన్మాదులకిది చెంపపెట్టు. హిందూ, ముస్లిం భాయి భాయీ."

"ఇంతకీ పెళ్లి ఏ పద్ధతిలో చెయ్యాలి?"

"ఇంకే పద్ధతి, హిందూ పద్ధతే!"

కరీం గొంతులో ఏదో అడ్డొచ్చి పొలమారింది.

అతనూ ఆ పెళ్లికి రెండు వందలు చందా ఇచ్చాడు.

"అలాక్కాదు, గురూ! అందుకు మా రెలిజియను ఒప్పుకోదు."

"భలేవాడివే! భర్తది ఏ కులం అయితే భార్యకి అదే కులం వస్తుంది. అలాగే భర్తది ఏ మతమో భార్యదీ అదే మతం!"

"అయినే నా రెండొందలూ నాకిచ్చేయ్!"

"తీసుకో. నీ లాంటి వాళ్ల ఇవ్వకపోతే ఏం మునిగిపోదు!"

"అదీ చూద్దాం భాయి!"

"హుఁ, అసలు మీ మతస్తులే ఇంత!"

"ఎక్కువగా మాట్లాడటం ఎందుకు?"

"మాట్లాడతాం. ఏం చేస్తావ్? రామూ, సుల్తానాల పెళ్లి హిందూ సంప్రదాయంలోనే జరుగుతుంది. దేశంలో ఉన్న ముస్లింలంతా ఏకమైనా సరే!"

కరీం,మాట్లాడలేదు. మాట్లాడకుండా అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అతని కి చాలాసేపటిదాకా అందరూ తనని చూసి హేళనగా నవ్వే నవ్వులు వినిపిస్తూనే ఉన్నాయి.

రాత్రి నిద్రపట్టలేదు. మొదట తన బాధని ఇంటిపక్కనున్న అబ్దుల్లాతో చెప్పాడు. అతను రహీంతో ...

"అందరికీ నచ్చీలాగ. పోనిద్దారి!" అన్నాడు ఎం.ఎల్.ఏ.

"ఇదేం పాకిస్తాను కాదు!" అంటూ అరిచాడు ఓ అత్యుత్సాహి.

"ఇక్కడ మాకూ హక్కుంది. ఈ దేశం నీ బాబు సొమ్మేం కాదు!" అన్నాడు మరో ఉక్రోషి.

ఆ రాత్రి హాస్పిటల్లో ఉన్న విశ్వనాథం కసిగా అన్నాడు - "ఆ కరీంగాడే దీనికంతకీ కారణం. వాణ్ని ..."

"వాడి పని పట్టేశారు మనవాళ్లు. రేపటిదాకా చెప్పలేం అన్నారట డాక్టరు గారు."

"శెభాష్! ఒరేయ్! పెళ్లిలో మంత్రాలు చదివించాలి, తెలిసిందా?"

"నువ్వాగు బాసూ! నా ప్రాణం పోయినా నాకు లెక్కలేదు. మన వాళ్లందర్నీ పోగెయ్యండి!"

* * *

"ఇలా జరుగుతుందనుకోలేదు."

"ఇప్పుడేం చేద్దాం?"

"నాకేం తోచటంలేదు. పొద్దుట్నించీ కనీసం ఓ వందమంది నాకు పాఠం చెప్పేశారు."

"మా మసీదు వాళ్లంతా వచ్చి నన్ను బెదిరించారు కూడా!"

"ఛ! ఇంత దారుణం ఎక్కడా ఉండదు!"

"ఇద్దరం రిజైన్ చేసేద్దాం. ఈమాత్రం బతుకులు ఇంకెక్కడో బతకలేకపోం."

"రాత్రికే రైలెక్కేద్దాం."

* * *

సుల్తానా సుబ్బలక్ష్మిగా మారిపోయింది. రాము మొదట్లో తానే మారతా నన్నాడు. అయితే "మనం మనం ఒకటి అంటూ ముస్లింలు దగ్గరకి చేరితే మన బండారం బయటపడుతుంది. నీకు మా పద్ధతులైనా తెలీవు. పొరబాటున ఏ గుడినో చూసి దణ్ణం పెట్టేస్తే కొంపలు మునుగుతాయి. హిందువులనయితే ఎవరూ పట్టించుకోరు. మన బతుకు మనం బతకొచ్చు!" అని చెప్పింది సుల్తానా.

దాంతో వాళ్ల జోలికెవరూ రాలేదు.

ఆమె మెడలో మంగళసూత్రం, నుదుటికి బొట్టూ వచ్చాయి. "అంతే, పెళ్లిఅయిపోయినట్టే!' ' అన్నాడు రాము.

"భలే!" అంది సుబ్బలక్ష్మి.

"ఇప్పుడు మనిష్టం. మనం పెద్దగా చదువు కోకపోవడం మంచిదైంది. ఆ ఉద్యోగాలు వదల్లేక అక్కడే చచ్చేవాళ్లం!"

"అవును. రేపు నేను నాలుగిళ్లలో పనికి కుదిరితే చాలు, నువ్వు కూడా ఎక్కడో సంపాదించలేకపోవు!"

"నిజమే, కష్టపడే వాడి బతుకు గొప్పగా ఉండదేమో కానీ, బతకడం ఎలా అని భయం లేదు!"

ఓ పూరిల్లు దొరికింది. కొత్త కాపరం మొదలైంది. మొదట్లో మరమరాలతో మొదలై మొత్తానికి అన్నంతినే స్థాయికి చేరగలిగారు. సుబ్బలక్ష్మి ప్రారంభించిన మిరపకాయబజ్జీల దుకాణం క్రమంగా చిన్నసైజు హోటల్‌గా మారింది. అక్కడ అన్ని మతాల వాళ్లూ తింటూనే ఉన్నారు. అందరికీ ఆ తిండి అరు గుతూనే ఉంది.

పెళ్లి ఏ పద్ధతిలో జరగాలీ అన్న ప్రసక్తితో ఇంకా బాధపడుతూనే ఉన్నారు విశ్వనాథం గట్రా. కరీం అయితే తన విరిగిన కాలుకంటే పెళ్లి గురించే ఎక్కువ బాధపడ్డాడు.

రాము, సుబ్బలక్ష్మి వాళ్లకి కనపడకుండా లేచిపోయినా వాళ్లు మాత్రం సంఘం పట్ల తమ బాధ్యతని విస్మరించలేదు. అవకాశం దొరికినప్పుడల్లా ఆ ఊళ్లో సంఘసేవ జరుగుతూనే ఉంది. పోలీసులకీ, డాక్టర్లకీ పని, తగులుతూనే ఉంది. న్యూస్‌పేపరు వాళ్లు ఆదర్శవివాహం సంగతి ప్రచురించలేకపోయి నందుకు బాధపడినా, తర్వాత సర్దుకుని రాము, సుల్తానాల గురించిన విశ్వసనీయ వర్గాల భోగట్టాలు యథాశక్తి వెలువరిస్తూనే ఉన్నారు. వాళ్లు ఎక్కడున్నా సరే, వారి పెళ్లి బాగా జరగాలని అందరూ కాంక్షిస్తూనే ఉన్నారు. అయితే వారి మీద అల్లా దయ ప్రసరించాలా, రాముడి దీవెనలు పడాలా అన్న విషయంలో అల్లరి ఆగలేదు.

అయోధ్యలో ఏం కట్టాలి అన్న విషయంలో కూడా ఊరంతా సామాజికస్పృహతోనే స్పందించింది.

విశ్వనాథం, కరీం ఇద్దరూ ఎదిగారు. పది సంవత్సరాలైంది.

రాము, సుబ్బలక్ష్మిల కొడుకు రెసిడెన్షియల్ స్కూల్‌లో చేరిపోయాడు. అమ్మ భాష, నాన్న భాష వదిలేసి ఇంగ్లీషులో మాట్లాడేస్తున్నాడు. అమ్మ, నాన్నల్ని కూడా ఆ భాషలోనే పిలుస్తున్నాడు.

వాడు తెలివైనవాడు. అసలు వర్ణసంకరం వల్ల తెలివైన పిల్లలే పుడతారట కూడా. అవి కొద్దిగానే ఉంటే బాగుండిపోయేది. చాలా ఎక్కువయ్యాయి. వాడు కాస్తా రాష్ట్రస్థాయిలో 'బాలకవి'గా పేరు తెచ్చుకున్నాడు. వాడి కవితకి గవర్నరు గారి మెడల్ అందజేయబడింది.

ఓ పేపరువాళ్లు ముచ్చటపడి వాడి ఫొటోతో బాటు, తల్లిదండ్రుల ఫొటోలు కూడా వేశారు.

అంతే!

'ఆమె పేరు సుల్తానా - సుబ్బలక్ష్మి కాదు' అని అందరికీ తెలిసిపోయింది.

వాళ్లకసలు పెళ్లే కాలేదనీ, సదరు బాలకవి పుట్టుకలో పవిత్రత లేదనీ పదిమందికీ ప్రకటితమైంది.

"పడవల్లోనూ గట్రా పెట్టుకున్న అక్రమ సంబంధాల వల్ల పుట్టిన వాళ్లకి పూజించే దిక్కుమాలిన జాతి!" అంటూ కరీం తిట్టిపోశాడు.

"ఆడదాన్ని ఓ వస్తువులా చూసే అనాగరిక జాతి!" అని విశ్వనాథం విజృంభించాడు.

మళ్లీ సంఘసేవ జరిగింది. ఎవరి దేవుణ్ని వాళ్లు రక్షించుకునే ప్రయత్నం భారీ ఎత్తున మొదలైంది.

'ఒరే బాలకవీ! నీ సంగతేమిట్రా?' అని పదిమందీ వాడిని నిలదీశారు.

సుబ్బలక్ష్మి హోటల్లో పదార్థాల రుచి మారింది. తినే వాళ్ల గొంతుకలకి అవి అడ్డం పడసాగాయి.

బాలకవిగాడు కాస్తా లేచొచ్చిన వాళ్ల అక్రమ సంతానం అయి కూర్చున్నాడు.

"ఏదో మంచివాడినవుకున్నాం, ఛీ!" అన్నారు రామూ ముఖంమీద నలుగురూ.

"పేద్ద పతివ్రతలా పోజు కొట్టింది!" అని అమ్మలక్కలు ఆవేశపడ్డారు సుల్తానా అయి మిగిలిన సుబ్బలక్ష్మిని చూసి.

"తెలివైన వెధవ అనుకున్నాం కానీ ఇలాంటి పుట్టుక పుట్టాడని మాకేం తెలుసూ?" అన్నారు బడిలోనూ, బయటా బాల కవిని చూసి.

* * *

"ఆమె మా మనిషి!" అన్నారు ముస్లింలు.

"సరే కానివ్వండ"న్నారు హిందువులు మంచితనంతో.

"వాడు మనిషి" అన్న హిందువుల్ని అభ్యంతరం పెట్టలేదు ముస్లిములు.

మతసామరస్యం వర్ధిల్లింది.

ఆ ఇద్దరి అంత్యక్రియలూ ఘనంగా స్వమతస్థుల మధ్య జరిగాయి.

'సెక్యులరిజం' గురించి రాసేందుకు కవులకీ, పత్రికలకీ మంచి అవకాశం దొరికింది.

ఎవరూ పట్టించుకోనిదల్లా ...

బాల కవిగాడి శవాన్ని మున్సిపాలిటీవారు ఏ మత పద్ధతి ప్రకారం కడతేర్చారు అన్నదే!

అనాథ శవాలకి మతాలుండవు కదా? Ⓟ

